
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

శనివారం 31 ఆగస్టు 2024

అర్హులైన వారందరికీ రుణమాఫీ చేస్తాం 8లో..

జిల్లాలో భారీ వర్షం
పొంగిపొర్లిన వాగులు 7లో..



ఆటలకు నిధుల కటకట

- అందని ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ బిల్లులు
- అప్పులపాలవుతున్న నిర్వాహకులు
- బిల్లుల కోసం ఎదురుచూపులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: జిల్లాలో క్రీడా పోటీల నిర్వహణపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు ఆరేళ్లుగా ఆటల బిల్లులు రావడం లేదు. ఇప్పటికే ఆడించిన ఆటలకు భరించిన బిల్లులు చేతికందక పోవడంతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులకు అప్పులే మిగులుతున్నాయి. దీంతో ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. జగిత్యాల జిల్లాకు సంబంధించిన సుమారు రూ. 10.50 లక్షల ఎస్‌జీఎఫ్ క్రీడా బిల్లులు రావాల్సి ఉన్నట్లు పూర్వ ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

● జగిత్యాల జిల్లాలో ఇలా...

జగిత్యాల జిల్లాలో 2018-19 విద్యా సంవత్సరంలోని అక్టోబర్‌లో స్థానిక వివేకానంద స్టేడియంలో రాష్ట్ర ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులను కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు తీసుకవెళ్లారు. అదేవిధంగా 2018 నవంబరులో కోరుట్ల పట్టణంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించి ఇందులో గెలు పొందిన క్రీడాకారులను మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థా యి పోటీలకు తీసుకెళ్లి ఆడించారు. 2019-20 విద్యాసంవత్సరంలో కరాటే పోటీలు, పెన్సింగ్ టోర్నమెంట్‌లను రాష్ట్ర స్థాయిలో నిర్వహించారు. విజేత లను నేషనల్స్ పోటీలకు తీసుకవెళ్లి ఆడించారు. ఇందులో పెన్సింగ్ టో ర్నమెంట్‌కు మాత్రమే దాత లభించడంతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శికి వ్యయం తప్పింది. మిగిలిన మూడు టోర్నమెంట్‌లకు సొంతంగా వ్యయం చేశాడు. కరోనా వంటి పరిస్థితుల కారణంగా 2020-21, 2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను నిర్వహించలేదు. 2023-24 లో తిరిగి ప్రారంభంకాగా, ప్రస్తుతం మండల స్థాయిలో 2024-25 సంవత్స రానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక నిమిత్తం క్రీడలు నిర్వహిస్తున్నారు.

● స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో...

పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు అవి తోడ్పడుతాయి. వారిలో పోటీతత్వాన్ని పెంపొంది స్తాయి. ప్రభుత్వం ప్రతీ సంవత్సరం స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల, జిల్లా, జోనల్ రాష్ట్ర జాతీయ స్థాయిలో అండర్ 14, 17, 19 ఏళ్ల వయస్సుల వారిగా, బాల బాలికలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహణ భారం జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులపై పడ డంతో రూ. లక్షల నిధులు ఆటల నిర్వహణకు వెచ్చిస్తున్నారు.

● ఆరేళ్లుగా అందని బిల్లులు...

జిల్లాలో గడిచిన విద్యా సంవత్సరాల్లో ఖర్చు చేసిన నిధులకు చెందిన బిల్లుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించారు. ఎస్‌జీఎఫ్ నిర్వహించే ఒక్కో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు సుమారు రూ. 2.50- 3.50 లక్షల వ్య యం అవుతుందన్న అంచనా ఉంది. జిల్లాలో నిర్వహించిన టోర్నమెంట్ లకు సంబంధించి బిల్లులను సమర్పించినప్పటికీ సుమారు ఆరేళ్లుగా పెం డింగ్ బిల్లుల నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణాధికారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ గోడును పట్టించుకునే నాథుడు కానరాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి క్రీడా పోటీలను ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున, పాత బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత సంవత్సర నిధులు కలుపుకొని ఏకకాలంలో నిధులు విడుదల చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. పాత బిల్లులు రావడంలేదనే సతమతమవుతుంటే, ప్రస్తుత పోటీల నిర్వహణ సంగతేంటని అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

● క్రీడా పోటీలపై నీలి నీడలు..

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. మండల స్థాయి, జిల్లా స్థాయి ఆటల పోటీలను స్థానిక పాఠశాల యాజ మాన్యాలు, దాతల సహకారాలతో నిర్వహిస్తుంటారు. వాటి నిర్వహణకు ఎస్‌జీఎఫ్‌కు ఎటువంటి సమస్య, వ్యయం ఉండదు. వాటిలో గెలుపొందిన విద్యార్థులకు జోనల్, జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపా లన్నా, ఆ స్థాయి పోటీలు సందర్భానుసారంగా ఇక్కడ నిర్వహించినా రవా ణా, నిర్వహణ, జ్ఞాపికలకు, వేదికల ఏర్పాటు, హాజరైన ప్రముఖులకు సన్మానాలు ఇతర ఖర్చులను ఎస్‌జీఎఫ్‌లు భరించాల్సి వస్తోంది. సంబంధిత డబ్బులను ఎస్‌జీఎఫ్ సొంతంగా భరించడం గానీ, అప్పు తీసుకొని ఖర్చు చేసి బిల్లులను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రతీ రెం డేళ్ల కొకమారు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాధ్యతలను ఒకరికి ప్రభుత్వం అప్ప గిస్తుంది. క్రీడల నిర్వహణ భారం కార్యదర్శి మోయాల్సి ఉంటుంది. బిల్లు లు వచ్చినప్పుడు తీసుకొని అప్పులు తీర్చేయడం వంటివి చేస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాలో 2018-19, 2019-20, 2020-21 సంవత్సరాల్లో ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన అధికారి చేసిన ఖర్చు రూ. 10.50 ల క్షల వరకు నేటికి అందలేదు. సుమారు ఆరేళ్లుగా బిల్లులు రాకపోవడంతో పెట్టిన డబ్బులకు, వడ్డీల భారం తడిచి మోపెడవుతూ తాము ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేప థ్యంలో తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్ విడుదల అవడం, దీనిలో భాగంగా ప్రస్తుతం మండల స్థాయి పోటీల నిర్వహణ సాగుతున్న తరుణంలో జిల్లా స్థాయి పోటీల నిర్వహణ కష్టసాధ్యం అవుతుందని, ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లు లతో పాటు, ప్రస్తుత క్రీడల నిర్వహణకు సంబంధించిన నిధులు సైతం విడుదల చేయాలని నిర్వాహకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బిల్లులు రావడం లేదు

- జిల్లా ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు, జగిత్యాల

జిల్లాలో 2018-19, 2019-20 సంవత్సరాల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూ డు స్టేట్ టోర్నమెంట్‌లను నిర్వహించాము. ఇందుకు ఒక్కో టోర్నమెంట్ నిర్వహణకు, అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను దేశంలోని వి విధ ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ జట్టు తరఫున తీసుకవెళ్లి రావడానికి సుమారు రూ. 3.50 లక్షల వరకు వ్యయం అయింది. ఇందుకు వ్యక్తిగతంగా సమకూర్చడం, రుణాలు తీసుకోవడం వంటివి చేశాను. ఇప్పటికీ సంబందిత బిల్లులు రాలేదు. అయిదేళ్లుగా బి ల్లుల కోసం ఎదురుచూపులతో గడుపుతున్నాను. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

ధర్మపురి ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



ధర్మపురి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ధర్మపురి, ఆగస్టు 30: జిల్లాలో జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. దర్మపురి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యుల హాజరు పట్టికను పరిశీలించి గైర్హాజరైన వైద్యుల వివరాలు సేకరించి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌పేషంట్, ఔట్ పేషంట్ విభాగాలను పరిశీలించి అడ్మిట్ అయి ఉన్న పేషంట్లను వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరు బాగుందా అని వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి రిజిస్టర్ ప్రకారం మందులు స్టాక్ నిల్వలు ఉన్నాయా లేవా అని సరిచూశారు. గైర్హాజ రైనటువంటి వైద్యులపై తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషన్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సమియుద్దిన్, డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ రామకృష్ణ, పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను శుక్రవారం డాక్టర్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పలు రోగాల బారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆస్పత్రులను తనిఖీ చేశామన్నారు. ఆసుపత్రుల్లో రోగాల నిర్ధారణ చేసే పరీక్షలకు, వైద్యచికిత్సలకు రోగుల నుంచి వసూల్ చేస్తున్న డబ్బుల వివరాలను స్పష్టంగా పట్టికలో ప్రదర్శించాలని, స్టాఫ్ వివరాలు సైతం ఆస్పత్రుల్లో ప్రదర్శించాలన్నారు. ఒకరిపేరు మీద హాస్పిటల్ నడుపుతూ మరొక డాక్టర్ ప్రాక్టీస్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు అన్ని వసతులను కల్పించాలన్నారు. రోజువారిగా నమోదయ్యే డెంగ్యూ కేసులను విధిగా జిల్లా వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ లేని ఆస్పత్రుల అనుమతులు రద్దు చేస్తామన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనరాయణ, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలబాలికలకు రక్షణగా 1098 హెల్ప్‌లైన్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: బాల, బాలికల జిల్లాలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 రక్షణగా ఉంటుందని సంస్థ కో ఆర్డినేటర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 0-18 ఏళ్ల లోపు బాల బాలికలకు రక్షణకు 24గంటలు చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 పనిచేస్తుందన్నారు. దీంతో పాటు బాల్య వివాహాలు, బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న పిల్లలు కనబడితే టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత టీమ్ సభ్యురాలు స్వప్న, కైలాష్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: జగిత్యాల పట్టణంలో అత్యంత ప్రసిద్దిగాం చిన లోకమాత పోచమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఆతల్లి చల్లని చూపుతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని పురాణిపేటలో గల శ్రీలోకమాత పోచమ్మ తల్లీ ఆలయ 62వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట వార్డు కౌన్సిలర్ ములస్తపు లత, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేంధర్ తో పాటు ఆలయ కమిటీలు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణ మండపాలకు ఉచిత విద్యుత్ అందించండి

సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ మహానగరంలో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసిన నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని మండపాలకు సైతం ఉచిత విద్యుత్ కల్పనకు చొరవచూపాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. హైదరబాద్ నగర మండపాలకు ఉచిత విద్యుత్ కల్పిస్తామని తీసుకున్న సీఎం నిర్ణయం హర్షణీయం అన్నారు. హైదరాబాద్ తరహాలో జగిత్యాల పట్టణ పరిధి మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేలా చొరవ తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న విప్ అడ్లూరి

ధర్మపురి, ఆగస్టు 30: క్రీడలు మానసికొల్లాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే మండల స్థాయి క్రీడ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యాన్ని పెంచుతాయన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు ప్రారంభించుకోవడం సంతోషదాయమన్నారు. విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతామన్నారు. విద్యారంగంలో ధర్మపురి ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, ఐఐటి కళాశాలతో పాటు నవోదయ పాఠశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

రాయికల్, ఆగస్టు 30: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని వివిధ యువజన సంఘాల సభ్యులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వినాయక నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జనంలో డీజేలు వినియోగించవద్దని, మండలాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత ఏర్పాటు చేసిన తమ మండప వివరాలను పోలీస్ అధికారులకు సమర్పించాలని అన్నారు. పోలీసులతో యువత సహకరించి వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. విద్యుత్, పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తామన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

వినాయక నవరాత్రుల్లో డీజేలు నిషేదం

భీమారం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్ అన్నారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మేడిపల్లి, భీమారం మండలాల యువజన సంఘాల సభ్యులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వినాయక నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జనంలో డీజేలు వినియోగించవద్దని, మండలాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కొడిమ్యాల : వినాయక చవితి ఉత్సవాలకు ప్రశాంత వాతవరణం ఉండాలని కొడిమ్యాల ఎస్సై సందీప్ అన్నారు. శుక్రవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ శబ్ద కాలుష్యం లేకుండా డీజేలను తక్కువ సౌండ్‌తో వినియోగించు కోవాలని సూచించారు. రోడ్డును ఆక్రమించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వినాయక మంటపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాణి

రాయికల్, ఆగస్టు 30: రుణమాఫీ కాని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాణి అన్నారు. రాయికల్ పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రేషన్ కార్డు లేని రుణమాఫీ అర్హత కలిగిన రైతుల కుటుంబాల వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, ఏఈవోలు నరేష్, పద్మావతి, సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను తనిఖీ చేసిన ఇంటర్ విద్యాధికారి

రాయికల్, ఆగస్టు 30: రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాలను శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఉపన్యాసకులతో, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం కళాశాల వరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిందం రాజేష్, ఉపన్యాసకులు మనోహర్ రెడ్డి, చౌడారపు శ్రీనివాస్, రాజమౌళి, దేవేందర్, రాజేంద్రప్రసాద్, రవీందర్, రహీం, రాజేశ్వర్, శ్రీనివాస్, గంగారెడ్డి, గంగాధర్, రాజగోపాల్, రజిత, ఉషారాణి, సిద్ధిఖీ పాల్గొన్నారు.

2నుంచి అర్బన్ మండల క్రీడల నిర్వహణ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: సెప్టెంబర్ 2,3,4 తేదీల్లో అండర్ 14,17 బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల మండల కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అర్బన్ మండల ఎంఆర్‌సీ కేంద్రంలో జగిత్యాల మండల విద్యాధికారి గాయత్రి అధ్యక్షతన జగిత్యాల మండల క్రీడల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకు న్నట్లు తెలిపారు. అండర్ 14 బాలికలకు 01.01.2011, అండర్ 17 బాలురకు 01.01.2008 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. కబడ్డీ పోటీలలో పాల్గొనే అండర్ 14 బాలికలు 48కిలోలు, అండర్ 17 బాలికలు 55 కిలోలు, అండర్ 14 బాలురు 51 కిలోల బరువు లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస్ మండల కన్వీనర్ 9440842962 గారిని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో మండల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

టీజేఏసీ సమావేశం

జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు వర్కర్స్ పెన్షనర్‌ల టీజేఏసీ సమావేశం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీజీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా సెప్టెంబరు 1 తేదీన నిర్వహించే కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలనే టీజేఏసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమం జగిత్యాలలో నిర్వహించడానికి పలు అంశాలపై చర్చ నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీజేఏసీ చైర్మన్ బోగ శశిధర్, జనరల్ సెక్రటరీ గంగుల సంతోష్ కుమార్, నాయకులు రమేష్, రవిబాబు, గణేష్, రాజేందర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, హరి అశోక్‌కుమార్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక బ్రాహ్మణవాడ, శ్రీరామమందిరంలో టీటీడీ ద్వారా మంజూరైన రూ.10లక్షల నిధులతో భజన (ధ్యాన) మందిరం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు టీటీడీ నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆలయాల నిధులకు సంభంధించిన అంశంపై ఎవరూ తన ను అడగలేదని, ప్రత్యేక చొరవతో నిధుల మంజూరుకు చొరవ చూపామన్నారు. నియోజకవర్గంలోని 9 ఆలయాలకు సైతం నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. భూమిపూజకు ముందు శ్రీరామమందిరంలో శ్రీరాముడిని దర్శించుకొని ప్రత్యేకపూజలు ని ర్వహించగా, వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ రఘు, టీవీ సూర్యం, తిగుళ్ల సూర్యనారాయణ, బ్రాహ్మణసంఘ సభ్యులు పాల్గొన్నారు.

●జగిత్యాల జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారిగా (ఎఫ్ ఏసీ)గా మమత నియమితులయ్యారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా సివిల్ సప్లై అధికారిగా జితేంద్రప్రసాద్, డీసీఎస్‌వోగా జితేందర్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

ఇల్లందకుంట ఎస్ఐపై ఏసీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఆగస్టు 30: ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్ అకారణంగా దూషిం చారని, మహిళా కానిస్టేబుల్‌తో కొట్టించారని. తనకు న్యాయం చేయాలని బాధితు రాలు పైడిపల్లి స్వప్న శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌జికి ఫిర్యాదు చేశారు.ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన తనను ఏడాదిన్నర క్రితం కట్కూరి నాగరాజు అత్యాచార యత్నానికి పాల్పడగా కేసు నమోదు అయిందన్నారు. అది మనసులో పెట్టుకొని తరుచూ నాగరాజు, అతని భార్య సూటిపోటీ మాటలు అనడంతో వారం రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ తననే బూతులు తిట్టారని, అంతేకాకుండా మహిళా పోలీసులతో కొట్టించారన్నారు. తన కు న్యాయం చేయాలని ఏసీపీని కోరగా జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేష న్‌లో సీఐని కలువాలని సూచించినట్లు తెలిపారు. ఎస్ఐపై సీపీకి కూ డా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా బాలికల రోడ్ సైక్లింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బాలిలక రోడ్ సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎంపిక పోటీల్లో అండర్-14, 16, 18, 23 అపై వయస్సు విభాగాలలో బాలికలకు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారు లను సెప్టెంబరు 14,15 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే ప్రాంతీ య స్థాయి ఖేలో ఇండియా పోటీలకు, జనగామలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 31 సాయంత్రం లోపు 9398230614 నంబరులో సంప్రదించాలని కోరారు. పాల్గొనే క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరు కావాలని సూచించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 79క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,350 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహన దారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీ లలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరి మానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారు లకు 35 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	8,500	5,555	80.5	60.118
ఎల్లంపల్లి	11,291	6,616	20.175	16.766
మిడ్ మానేరు	9,400	21,000	27.54	16.40
ఎల్ఎండీ	14.850	250	24.034	12.107

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ఆశీర్వచనం అందించిన రాజన్న ఆలయ అర్చకులు

- శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు ప్రతిపాదనలు



సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందిస్తున్న రాజన్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. 50 కోట్ల నిధులు బడ్జెట్‌లో పెట్టడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేశ్, సురేష్, చందు సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందించారు. రాజన్న ఆలయ విస్తరణ కోసం శృంగేరి పీఠాదిపతులను కలివాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిసింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా త్వరలోనే రాజన్న ఆలయాన్ని దేవాదాయశాఖ కమిషనర్‌తో పాటు ప్రభుత్వ కార్యదర్శిలు సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయశాఖ స్థపతి వల్లియాగం, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పలువురికి జరిమానాలు



జరిమానా రశీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణంలోని పుర వీధుల్లో చెత్తను విచ్చల విడిగా పడవేస్తున్న అపరిశుభ్రం చేస్తున్న దుకాణ యజమానులను శుక్రవారం మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు గుర్తించి జరిమానాలను విధించారు. ఒక్కక్కరికి రూ. 500ల నుంచి రూ. 1000 వరకు జరిమానాలు విధించి దుకాణం యజమానులకు జరిమానా రసీద్‌లను మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది అందజేశారు. భవిష్యతు_లో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే భారీ జరిమానాలు విధి స్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, శేఖర్, దేవయ్య, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు నవోదయం



నవోదయ విద్యాలయం

విద్యతో పాటు నైతిక విలువలకు పెద్ద పీట వేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న నవోదయ విద్యాలయాలు నవశకానికి నాంది పలుకుతున్నాయి. ప్రతిభ ఉన్నా చదువు కోలేని గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతోంది జవహర్ నవోదయ విద్యాలయం.

» గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యం » ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన

» దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల » సెప్టెంబరు 16 తుది గడువు

చొప్పదండి, ఆగస్టు 30: ఉత్తమ విలువలు, ఉన్నత ప్రమాణాలు, దేశ భక్తి, నైపుణ్యం, క్రీడలలో భాగస్వామ్యం, చదువుతోపాటు సమాజ సేవ ఇవన్నీ నవోదయ విద్యాలయంలోనే సాధ్యం. క్రమశిక్షణకు పెట్టింది పేరైన జవహర్ నవోదయ విద్యా లయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆరు నుంచి 12 వ తరగతి వరకు పూర్తి గా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత విద్యను అంది స్తారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం నవోదయ విద్యాలయ సమితి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

- సీబీఎస్ఈ సిలబస్..

విద్యాలయంలో ఆరో తరగతి నుంచి కంప్యూటర్ విద్యను ప్రత్యేకంగా బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన, ఆధునా తనమైన సైన్స్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, జిమ్ హాల్, క్రీడా మైదానం కలిగి ఉండడం విద్యాల యం ప్రత్యేకతలు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలి. మొక్కలను నాటి వాటి సంరక్షణ విద్యార్థులు చూసుకోవాలి. విద్యార్థులపై ఎలాం టి ఖర్చు లేకుండా పూర్తిగా రెసిడెన్షియల్ ప ద్ధతిలో బోధనను అంది స్తున్నారు. విజ్ఞాన జ్యో తి పథకంలో భాగంగా 9 నుంచి 12వ తరగతి బాలికలకు నీట్, ఐఐటీ కోచింగ్ కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది.

- 80 సీట్లకు గానూ..

విద్యాలయంలో ఆరో తరగతిలో ఉన్న 80 సీట్లు గాను ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 14బ్లాక్‌ల వారీగా దర ఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్ లోనే తమ దరఖాస్తులు చేసుకోవాలి. సెప్టెంబరు 16 తేదీని దరఖా స్తులకు చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్షను జాతీయస్థాయిలో సీబీఎస్ఈ నిర్వహిసు_న్నది. ప్రవేశపరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల దరఖాస్తులు రాగా జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచి విద్యాలయం అవార్డును దక్కించుకుంది.

- గ్రామీణ విద్యార్థులకు 75శాతం..

విద్యాలయంలో 80 సీట్లకు గాను75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీల కు, 7.5 శాతం ఎస్టిలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. ప్రవేశ పరీక్ష మార్కులు, మెరిట్, క్యాటగిరి ఆధారంగా సీబీఎస్సీఈ ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తుంది.

అర్హులు దరఖాస్తు చేసుకునేలా..



అర్హులైన ప్రతి విద్యార్థి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోస పోవద్దు. విద్యార్థులు కష్టపడి చదివితే సీటు సాధించవచ్చు. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- మంగతాయారు, ప్రిన్సిపాల్

ప్రవేశ పరీక్షకు అర్హతలు..

ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు మూ డు నుంచి ఐదో తరగతి వరకు ప్రభు త్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదవాలి. విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. 2013 మే1 నుంచి 2015 జూలై 31 లోపు జన్మించిన వారే దరఖాస్తులకు అర్హులు. విద్యార్థికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేనట్లయితే తహసీ ల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. కాగా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థి తన బ్లాక్ ఎంచుకొని వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. విద్యార్థులు తప్పని సరిగా గ్రామాలకు చెందిన వారే ఉండాలి. చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, పెద్దపల్లి, మంథని. సుల్తానాబాద్, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి, జగి త్యాల, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ మున్సిపా లిటీలుగా మారగా ఇక్కడ నివసించే విద్యార్థులు అర్బన్ క్యాటగిరి కిందికి వస్తారు. ఈ ప్రాంత విద్యార్థులు అర్బన్ కోటా కిందనే దరఖాస్తు చేసుకోవాలి.

భారీ వర్షం

●పొంగిపొర్లిన వాగులు ●లోతట్టుప్రాంతాలు జలమయం

జగిత్యాల అర్బన్/జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి సగటున 40 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా మేడిపల్లిలో 86.1 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 84.6, జగిత్యాల రూరల్‌లో 74.4, మల్యాలలో 73.3, రాయికల్ మండలంలో 65.5, మల్లాపూర్ మండలంలో 55.8, పెగడపల్లిలో 42.2, కొడిమ్యాలలో 41.8, మెట్‌పల్లిలో 36.6, కథలాపూర్‌లో 34.2, సారంగాపూర్ మండలంలో 34.2, ఇబ్రహీంపట్నంలో 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల పట్టణంతోపాటుగా, పరిసర ప్రాంత గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జగిత్యాల జలమయంగా మారింది. వాగులు, లోతట్టు ప్రాంతా ల్లోకి భారీగా వర్షంనీరు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి, కాలనీల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని గోవిందుపల్లి వాగు, మోతె వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో గోవిందుపల్లి అవతలివైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. మోతె వాగు పొంగి పొర్లడంతో గొల్లపల్లి నుంచి జగిత్యాలకు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. నీరు వాగుపైకి భారీగా ప్రవహించడంతో ప్రయాణికులు ఇతర దారి గుండా రాకపోకలు సాగించారు. వెంకటాద్రినగర్ కాలనీకి అత్యవసరం ఉన్నవారిని జేసీబీ సహాయంతో వాగు దాటించారు. సుమారు 500ల కుటుం బాల వరకు వాగు అవత లివైపు నివసిస్తుండగా భారీ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చల్‌గల్ వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న మోతె వాగు

బేసిక్ పే అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు బేసిక్ పే విధానం అమలు చేయాలని కోరుతూ జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంఆర్‌సీ భవనం నుంచి, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో సమ్మె చేస్తున్న సమయంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ నేటి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేయడంతో పాటు, అప్పటి వరకు బేసిక్ పే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

క్రైం వార్తలు

అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే చర్యలు

- నిబంధనలు అతిక్రమించిన ముగ్గురు డీజే నిర్వాహకుల అరెస్ట్

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధలనకు విరుద్ధంగా డీజేలు నడుపుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరులో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిబంధలనకు విరుద్ధంగా డిజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది వెళ్లి ఆపమని చెప్పినా ఆపకుండా విధులకు ఆటంకం కల్పించిన దొంతరవేణి నవీన్, దొంతరవేని మల్లేశ్, దొంతరవేణి రంజిత్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

బైండోవర్ అతిక్రమించిన వారికి జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ముగ్గురికి గురువారం జరిమానా విధించి, మరొకరికి వారెంట్ జారీచేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన లింగంపల్లి అనిల్(28) అనే యువకుడు మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేయడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ బైండోవర్‌ను అతిక్రమించి మళ్లీ ఇసుకను అక్రమ రవాణా చేసినందున అతనిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ. 15వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బల్వీర్‌సింగ్ (42), చంద్రంపేటకు చెందిన సంపంగి మల్లవ్వ(53) బెల్ట్‌షాప్ నిర్వహించడంతో బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ అతిక్రమించి మళ్లీ అదే షాప్ నిర్వహించడంతో ఒక్కొక్కరికి తహసీల్దార్ రూ. 20వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తుమ్మల శివకుమార్(21) అనే యువకుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మళ్లీ అదేవిధంగా చేసినందుకు అతనికి వారెంట్ జారీచేశారని టౌన్ సీఐ తెలిపారు. బైండోవర్‌ను ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదని, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లో గతంలో పలు నేరాలకు పాల్పడడంతో ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట శుక్రవారం హాజరు పర్చడంతో జరిమానా విధించారని పేర్కొన్నారు. రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లోని అనరాశి కిష్టయ్య దొంగిలించిన ఇనుప సామగ్రి కొనుగోలు చేయడం, మద్యం అనుబంధ దుకాణాలను నిర్వహిస్తున్న బొమ్మనవేణి పర్శరాములు, మందాటి సతీష్‌ను గతంలో బైండోవర్ చేశామని చెప్పారు. బైండోవర్లను అతిక్రమించడంతో తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా కిష్టయ్యకు రూ.25 వేలు, బొమ్మనవేణి పర్శరాములుకు రూ.25 వేలు, మందాటి సతీష్‌లకు రూ.10 వేలు జరిమానా విధించారని వివరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

భూ వివాదం కేసులో ఆరుగురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: తప్పుడు రిజిస్ట్రేషన్‌ద్వారా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూ వివాదాన్ని సృష్టించిన 21 మందిపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన నీరుమల్ల శ్యాంసుందర్ మానకొండూర్ పరిధిలోని సర్వే నంబర్ 1262, 1266లో రెండు ఎకరాల ఇరువయిన్నర గుంటల భూమిని దేశబోయిన బాలయ్య, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన శ్రీనివాస్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. ధరణి పోర్టల్‌లో పొరపాటున ఈ నలుగురిపేరిట నాలుగు ఎకరాల భూమికి బదులుగా ఏడు ఎకరాల పద్నాలుగున్నర గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదైంది. దానిని అదునుగా భావించి మోకాపై లేని భూమిని పలువురికి విక్రయించారు. నీరుమళ్ల శ్యామ్‌సుందర్‌కు విక్రయించిన భూమిలోని తొమ్మిది గుంటలను కొండా మురళి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది అన్యాయమనినీరుమల్ల శ్యాం సుందర్ నిలదీయగా 25 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్యాం సుందర్ కొన్న భూమిలోంచి ఎకరం రెండు గుంటలను చిట్టుమల్ల శ్రీనివాస్, అతని కుమారుడైన చిట్టుమల్ల అచ్యుత్‌చైతన్య పేరిట రిజిస్ట్రేషన్‌చేయించారు. ఈ విషయంపై శ్యాంసుందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న చిట్టుమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను కేసులు ఉపసంహరించుకోవాలని, సమస్యను తాను పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో శ్యాంసుందర్ కేసులను ఉపసంహరించుకున్నాడు. తర్వాత పట్టించుకోలేదు. మళ్లీ సమస్యను పరిష్కరిస్తానని 11 గుంటల భూమిని బొల్లినేని సృజన్‌రావుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి తిరిగి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించాడు. మరి కొంత భూమిని పట్టాదారులతో కుమ్మక్కై కొండా మురళి, వంగల సంతోష్, గంప ఫణీంద్రకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో నీరుమళ్ల శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేష్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, , గంప రవళి, వంగల గీత, గంప ఫణీంద్ర, యంసాని రాధా కృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన. శ్రీనివాస్, దేశబోయిన. గోపాల్, దేశబోయిన శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదా దేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

యువకుడి ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో దారుణం



పవన్(ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 30: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన దాతు పవన్(25) అనే యువకుడు గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకు న్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... రామగుండం నగరపాలక సంస్థ 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు పవన్ బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నించాడు. కొన్నిరో జుల పాటు ఉద్యోగం చేసి పవన్ మెరుగైన ఉద్యోగానికి ప్రయత్నించే క్రమంలో ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గుర య్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గోపురానికి రంధ్రం చేసిన దుండగులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30: మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌లో ఉన్న ప్రాచీన కాలం అం డాలమ్మ దేవాలయ గోపురాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారు. దేవాలయ గోపురానికి రంధ్రం చేసి నిచ్చె న ద్వారా అందు లో గుప్త నిధుల కోసం వెతికి నట్లు అనవాళ్లు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెట్‌పల్లి మండల కోనరావుపేట గ్రామానికి చెందిన ఎనుగు గంగారెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మూడు రోజుల క్రితం వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంగారెడ్డితో పాటు పశువైద్య కళాశాలకు చెందిన విద్యార్థి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహకారంతో వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగారెడ్డి గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసులో రెండేళ్ల జైలు

ధర్మారం, ఆగస్టు 30: మండల కేంద్రానికి చెందిన రాగుల మల్లేశం అనే నేరస్తుడికి వేధింపుల కేసులో శుక్రవారం నందిమేడారం కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎన్ వెంకటసచిన్‌రెడ్డి రెండేళ్ల పాటు జైలు, రూ.6వేలు జరిమానా విధి స్తూ తీర్పు ఇచ్చారు. తేది. 2.12.2015న రాగుల శ్రీలత తన భర్త మల్లేశం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను వేధిస్తున్నాడని తన అత్త లక్ష్మి, మామ రాజయ్యలు మద్దతు పలుకుతున్నారని ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాక్షులను విచారించిన జడ్జి నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసుల కొరడా

- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల డైలీ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లు, ఆఫీసుల్లో పోలీసులు దాడులు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిరిసిల్ల టౌన్, వేములవాడ టౌన్, తదితర అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారస్తులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారస్థుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో పలు ప్రామిసరీనోట్లు, డాక్యుమెంట్లను, చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్య ప్రజలను అధిక వడ్డీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరమైన పద్ధతులతో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే ప్రజలు నమ్మాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 16 మందిపై కేసు నమోదు చేసి 8.60లక్షల నగదుతో పాటు 43 బ్లాంక్ చెక్కులు, 36 ప్రామీసరి నోట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.



సిరిసిల్లలో వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన గాద గణేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. అవసరం ఉన్న వారికి డబ్బు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు గాద గణేశ్ ఇంటిలో శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు ఖాళీ చెక్కులు, 15 ప్రామిసరీ నోట్లు, ఓ వర్జినల్ ఆర్సీ పేపర్ లభించాయి. దీంతో గాద గణేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

వెల్గటూర్, ఆగస్టు 30: సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రిలో సరిపడా అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్ : వర్షాకాలంలో నిలువ నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో డ్రై డే సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణతో కలిసి కాలనీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పరిశీలించి నీటి కుండీలను శుభ్రం చేయించి, నిల్వ ఉన్న నీరు పారిపోయించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణ, ఏఎన్ఎమ్‌లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: సీజనల్ వ్యాధుల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సింధూజ సూచించారు. శుక్రవారం మండలంలోని చింతకుంట, తక్కళ్లపల్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో ఉండే పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని లేదంటే లార్వావృద్ధి చెంది దోమల బెడద పెరుగుతుందని అన్నారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి అందుకుగాను ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి ఇళ్లల్లో నీరు నిల్వ ఉన్న పాత్రలను గుర్తించి పారబోశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారిణి హిరన్మయి, సూపర్‌వైజర్‌లు శ్రీధర్, సునీత, ఏఎన్ఎంలు గంగా, కవిత, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ దృష్టి

కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల శ్రేయస్సు కోరుకుంటుందని, సంక్షేమ పథకాల అములుపై ప్రత్యేక దృష్టి సారిస్తుందిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం ఎల్లాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో ఏర్పాటు చేసి న కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పద్మశాలి సభ్యులు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. అర్హు లైన ప్రతి రైతుకు రుణమాఫీ పథకం వర్తిస్తుంద న్నారు. కిసాన్ సెల్ కార్యవర్గాన్ని ప్రకటించి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, పుంద్రా శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, రాజేందర్‌రెడ్డి, మా సుల బుచ్చిరెడ్డి, వర్ధసురేష్, చిన్నరాజన్న, రమేష్‌గౌడ్, ఆనంద్ గౌడ్, రమేష్, దశ రథం, రవీందర్ పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

వెల్గటూర్ మార్కెట్ కమిటీ నియామకం

● చైర్‌పర్సన్‌గా గుండాటి గోపిక



గుండాటి గోపిక

వెల్గటూర్, ఆగస్టు 30: వెల్గటూర్ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంబారిపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండాటి జితేందర్‌రెడ్డి సతీమణి గుండాటి గోపిక నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా ము త్తునూర్‌కు చెందిన గోల్ల తిరుపతి నియమితులయ్యారు. సభ్యులుగా దావ మహిపాల్ రెడ్డి, చెల్పూరి చంద్రమౌళి, బీసవేని హరీష్, సింగతి శ్రీనివాస్, సప్ప లింగయ్య, దూడ రవి, కడారి సత్తయ్య, జూపాక ప్రవీణ్, మాచర్ల సంజీవ్, పోలోజు శ్రీనివాస్, పొరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాత రాజేశం నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎండపల్లి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ధర్మపురి అసిస్టెంట్ ఆఫ్ అగ్రికల్చర్, వెల్గటూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సభ్యులుగా ఉండనున్నారు.

మహిళాశక్తి యూనిట్ల పరిశీలన

జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : జగిత్యాల రూరల్ మండలంలోని హైద్రాపల్లి గ్రామానికి చెందిన స్వశక్తి సభ్యురాలు స్వరూప జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీస్టాల్, మిల్క్ కేంద్రాన్ని జిల్లా ఐకేపీ ఏపీడీ చరణ్‌దాసు సందర్శించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్, అర్బన్ మండలంలోని మోతె, హస్నాబాద్, ధరూర్ తదితర గ్రామాల్లో మహిళశక్తిద్వారా ఏర్పాటుచేసిన నాటుకోళ్లపెంపకం, క్యాంటీన్ల ఏర్పాట్ల గురించి సభ్యులతో చర్చించారు. ఈకార్యక్రమంలో కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ మహమ్మద్ మోయిజ్‌పాషా, డీపీఎం వెంకటేష్ ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

మల్యాల, ఆగస్టు 30: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై నరేశ్ కోరారు. రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా రహదారులపై విగ్రహాలు పెట్టకూడదని, నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేకు అనుమతి లేదని, మైక్ సౌండ్ ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాల మొదలు నుంచి పూర్తి అయ్యే వరకు పూర్తి బాధ్యతలు నిర్వాహకులదేనని స్పష్టం చేశారు.

ఎజెండా అంశాలపై సమీక్ష చేయండి

కలెక్టర్‌కు 35వార్డు కౌన్సిలర్ వినతి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 27న నిర్వహించిన సాధారణ సమావేశంలో పొందు పర్చిన కొన్ని అంశాలపై పునఃసమీక్ష చేయాలని కోరుతూ 35వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. వాటర్ ట్యాంకర్‌ల కోసం ఇద్దరు డ్రైవర్‌లను తీసుకునేందుకు ఎజెండాలో పెట్టగా, తాము వ్యతిరేకించడంతో డ్రైవర్‌లను తీసుకోమని పేర్కొని, మళ్లీ ఎజెండా పాస్ అయ్యిందనే నెపంతో డ్రైవర్‌లను ఎంగేజ్ చేసుకుంటామని పేర్కొంటున్నారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు తక్షణమే ఈ నియామకాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో సానిటేషన్, వాటర్ సప్లై చేయుటకు గానూ 27 మంది లేబర్‌లను సెప్టెంబర్ 2024 నుంచి మార్చి 2025వరకు ఎంగేజ్ చేయుటకు కౌన్సిల్‌లో తీర్మాణం ప్రవేశపెట్టారని, ఈ నియామకం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీడీఎంఏ ద్వారా అనుమతి తీసుకొని కలెక్టర్ ద్వారా నియామకం జరిగేలా చూడాలన్నారు.

ఘనంగా బేతాళ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న కాగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 30 : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో బేతాళ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మాణం చేసిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరుబావిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటి, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, బన్న రాజేష్, అడెపు మధు, కొంత రాజం లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

మల్లాపూర్, ఆగస్టు 30 : గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను రవాణ చేసిన, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చారించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ఇసుక రవాణ జరగకుండా సమావేశం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేసుకున్న ట్రాక్టర్లతో అనుమతి తీసుకున్న తరువాత ఇసుక రవాణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, ట్రాక్టర్ యజమానులు, పాల్గొన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా నిర్వహించాలి

పెగడపల్లి, ఆగస్టు 30 : వార్డుల వారి ఓటరు జాబితా పనులను సక్రమంగా నిర్వర్తించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాను వార్డుల వారిగా చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే పనులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించగా ఎంపీడీవో పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ రుణమాఫీ చేస్తాం

● రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ బీఆర్ఎస్ డ్రామాలు.. ● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

మేడిపల్లి, అగస్టు 30 : అర్హులైన రైతులందరికీ మరో 27 రోజుల్లోనే రూ 18 వేల కోట్లు రుణమాఫీ ఖచ్చితంగా చేసి తీరుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ బీఆర్ఎస్ డ్రామాలు చేస్తున్నరని మండిపడ్డారు. మేడిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి జూలై 15న రుణమాఫీ జీవో తెచ్చారని గుర్తు చేశారు. జులై 18 తేదిన లక్ష వరకు జులై 30న లక్షా50 వేల వరకు ఆగస్టు 15 రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతు సమస్యల పైన ఏ మాత్రం పట్టించుకోని వారు ఈ రోజు ధర్నాల పేరులో డ్రామాలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ బీఆర్ఎస్ చేస్తున్న నాటకాలను రైతులు నమ్మొద్దని, సాంకేతిక కారణంగా రుణమాఫీ కానీ రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజు, నర్సరెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్, గంగరెడ్డి, గంగరాజం, అజీమ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి, ఆగస్టు 30 (ఇబ్రహీంపట్నం) : మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మున్సిప్ చైర్‌పర్సన్ రాణవేణి సుజాత-సత్యనారయణ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలలో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు టీగార్డులను ఏర్పాటు చేశారు. పట్టణ శివారులోని అరపేట గ్రామంలో రోడ్డుకు ఇరువైపు 100 మొక్కలను నాటుతున్నట్లు చైర్మన్ సుజాత తెలిపారు. జాతీయ రహదారిపై ఉన్న డివైడర్లలో మొక్కలను కటింగ్ చేసి పూల మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. కమీషన్ మోహన్, డీఈ నాగేశ్వర్‌రావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, పాల్గొన్నారు.

సాయిబాబా హుండీ ఆదాయం రూ.5,09,726

కోరుట్ల, ఆగస్టు 30 : కోరుట్ల సాయిబాబ హుండీ ఆదాయం రూ. 5,09,726 సమకూరింది. ఈ మేరకు ఆలయ హుండీని శుక్రవారం ఆలయ ఈవో కాంతారెడ్డి పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. నగదుతో పాటు 28 గ్రాముల మిశ్రమ బంగారం, కిలో 600 గ్రాములు మిశ్రమ వెండి సమకూరింది. నగదుతో పాటు వచ్చిన వెండి, బంగారం బ్యాంకు ఖాతాలో జమచేశారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

కొడిమ్యాల, ఆగస్టు 30 : మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీల విజయవంతానికి పీడీలు, పీఈటీలు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో ఎ. శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో పీడీలు, పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ సెప్టెంబరు 3న క్రీడా పోటీలు అండర్ 14, 17 బాలికల క్రీడోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సెప్టెంబరు 4న అండర్ 14, 17 బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఎంపిక పోటీలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 6న అండర్ 14, 17 బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొను విద్యార్థులు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ బూట్ల రాజమల్లయ్యకు సెప్టెంబరు 2 సాయంత్రం 4 గంటల లోపు వివరాలు అందించాలన్నారు. ఎస్‌జీఎఫ్ మండల కమిటీ వైస్ చైర్‌పర్సన్ వి.యేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీరాంనాయక్, పీడీలు రాజమల్లయ్య, బీరయ్య, శివక్రిష్ణ, అనూప్ రెడ్డి, ఆదిరెడ్డి ఉన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండవ రోజు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, పిడి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుఖేందర్ గౌడ్

మెట్‌పల్లి, ఆగస్టు 30 (ఇబ్రహీంపట్నం) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయతీలో బీజేపీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జు సుఖేంధర్ గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ్డు రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ సభ్యత్వ నమోదు నగర ఇన్‌చార్జి వీసరి నర్సయ్యతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి సుఖేంధర్ గౌడ్ ప్రారభించారు. సుఖేంధర్ గౌడ్ మాట్లడారు. కేంద్ర ప్రభుత్వ నిదులతోనే గ్రా మ పంచాయతీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెం దుతున్నాయన్నారు. మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ మీనా బీజేపీ నాయకులు యాదగిరి బాబు, గుంటుక సదాశివం, దోనికెల నవీన్‌కుమార్, సింకెటి విజయ్, రమేష్ యాదవ్, గంగన ర్సయ్య, ఆనంద్, సుంకి ఆశోక్, సునిత, ప్రసాద్, లింగేశ్వర్, రాకేష్, రూపేష్, దేవరాజు, బాస్కర్ ల తో పాటు పలువురు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్ : మండలంలోని పల్లెల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలం కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యుత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతున్నరని ప్రజలకు వివరించాలని, సంక్షేమ పథకాల గురించి అన్ని వర్గాల ప్రజాలకు తెలయజేస్తూ పార్టీని బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సభ్యుత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సరెడ్డి, గజ్జి శ్రీను, రాజేందర్, రాజుకుమార్ పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో పాలుపంచుకోవాలి

బీజేపీ జగిత్యాల నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి

రాయికల్, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వం తీసుకుని వికసిత భారత్‌లో పాలుపంచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి అన్నారు. బీజేపీ రాయికల్ పట్టణ, మండల సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం-2024 కార్యశాల కార్యక్రమంలో పాల్గొని ప్రతి నాయకులు, కార్యకర్త ప్రతి బూత్‌లో 200 మందితో సభ్యత్వం చేయించాలన్నారు. సభ్యత్వ నమోదు కోసం 88000-02024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్డును ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, రాయికల్ మండల ప్రధాన కార్యదర్శులు ఆకుల మహేష్, తీపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు మంగళారపు లక్ష్మీనారాయణ, కుర్మ మల్లారెడ్డి, సీనియర్ నాయకులు మచ్చ నారాయణ, శివనీతి రమ్య, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, ప్రతి బూతులో 200 మందిని సభ్యత్వం చేయించాలని ఇందుకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. అన్ని గ్రా మాలకు ఇన్‌చార్జిలను, సహాయ ఇన్‌చార్జిలను నియమించామన్నారు. సమావేశంలో మండల సభ్యత్వ ఇన్‌చార్జి చింతకింది అనసూర్య, బాబు, మోహన్‌రెడ్డి, రాజేశం, గట్టయ్య, తిరుపతి పాల్గొన్నారు.

రేషన్ కార్డులు లేని రైతుల వివరాల సేకరణ

కథలాపూర్, ఆగస్టు 30 : మండలంలోని సిరికొండలో శుక్రవారం రేషన్‌కార్డులు లేక రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధి కారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కేవలం రేషన్‌కార్డులు లేని వారి వివరాలు మాత్రమే సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నామని ఏఈవో శేఖర్ తెలిపారు. మండలంలో సుమారు 690 మంది రైతులకు రేషన్‌కార్డులు లేని వారు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నెల 31న తక్కళ్లపల్లి, సెప్టెంబర్ 2న భూషణరావుపేట, 3న దుంపెట, 4న దూలూరు, 5న చింతకుంట, 6న బొమ్మెన, 9న తాండ్ర్యాల, 10న గంభీర్‌పూర్, 11న కలి కోట, 12న పోసానిపేట, 13న పెగ్గెర్ల, 14న అంబారిపేట, 17న ఇప్పపల్లి, 19న తుర్తి, 20న పోతారం, 21న నాగమల్లప్పకుంట, 23న ఊట్‌పల్లి గ్రామాల్లో ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

గొల్లపల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాంబాబు అధికారులను ఆదేశించాఆరు. హాస్టల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంట గదిని పరిశీలించారు. విద్యార్థులు అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండటానికి శుభ్రత పాటించాలని, ఆరోగ్యకరమైన వంటకాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే మండల కేంద్రంలో రానున్న ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, ఇంటింటి సర్వే పనులను సందర్శించారు. వార్డు ఓటర్ల సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట మార్గదర్శకాలు, సూచనలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, ప్రిన్సిపాల్ సుష్మిత, గిర్దావర్ అనూష, జీవన్, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు హరిప్రియ, అనంత లక్ష్మి, ఉమారాణి పాల్గొన్నారు.



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కొడిమ్యాల : ఇళలో, రోడ్లపై నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్)గౌతంరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పూడూర్ గ్రామ పంచాయతీ పరిసరాలను. గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో చెత్త తొలిగింపు పనులను పరిశీలించి నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రైమెరీ పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు బీఎల్వో విదులను గురించి అవగాహన కలిపించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో స్వరూప, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన

మల్యాల, ఆగస్టు 30: మహిళల రక్షణ- మూఢనమ్మకాల నిర్మూలణపై భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మల్యాలలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భానస రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానమే ఆభరణమని సమాజంలో వేళ్లూనుకుపోయిన మూఢ నమ్మకాలను నమ్మకుండా, శాస్త్రీయ విజ్ఞానంపై ముందుకు వెళ్లాలని అన్నారు. దొంగ స్వాములు, బూత వైద్యులను విశ్వసించకూడదని పేర్కొంటూ వారు చేసే మోసాలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. చేతిపై మంటలు, నోట్లో మంటలు తీస్తు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం.నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్: మండలంలోని రాజనగర్ గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ముల లక్ష్మి భర్త రాజేశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే కిష్టంపేట గ్రామ నాయకుడు బొంతల ఆదిరెడ్డి అన్న వెంకట్‌రెడ్డి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన ఆకుల అంజయ్య గౌడ్‌కు ఇటీవల శస్త్రచికిత్స కాగా పరామర్శించారు. గాజెంగి శశాంక్ అనారోగ్యంతో ఉండగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ దీటి రాజరెడ్డి, నాయకులు రాజన్న, లావ్‌చావ్లా రాజన్న, తిరుపతి గౌడ్, జాన గంగాధర్, జాన గోపి, చిలుక శ్రీనివాస్, ముల్క గంగనర్సయ్య, శేఖర్, సళ్ళ శేఖర్, కట్ట సురేష్, ఆదిరెడ్డి, నాగరాజు, సత్తవ్వ, లచ్చవ్వ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయాలని నిరసన

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 30: అర్హతలున్నా రుణమాఫీ కాని రైతులకు మద్దతుగా మెట్‌పల్లి విశాల సహకార సంఘం మాజీ చైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి చెవులో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ అధికారులకు వినతిపత్రం అందజేసి షరతులు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కలకు ముందు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని దేవుడి మీద ఒట్టేసి మరీ చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కొర్రీలు పెట్టి కాలయపాన చేస్తూ రైతులను మోసం చేస్తున్నరని తీవ్రంగా విమర్శించారు. గ్రామంలో కనీసం సగం మందికి కూడ రుణ మాఫీ కాలేదని, సర్వే పేరుతో భూపత్రాలు, ఆధార్ కార్డులు చూపించిన ఫ్యామీలి మెంబర్ సర్టిఫికేటు తీసుకరావాలని ఇబ్బందులకు గురి చేయడం సరికా దన్నారు. ప్రభుత్వం రైతులది అంటూనే అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపచేయకుండా అన్యాయం చేస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఇబ్బందులు పెట్టకుండా అర్హులైన వారి ఖాతాకు రుణమాఫీ జమ చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రైతులు, తదితరులు ఉన్నారు.

వైద్య చికిత్స కోసం సాయం

కోరుట్ల, ఆగస్టు 30 : పట్టణంలోని రవీంద్ర రోడ్డుకు చెందిన సబీనా బేగం అనారోగ్య సమస్యతో బాధపడుతుండటంతో కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందేలా చూశారు. సబీనా బేగంకు అత్యవసర చిక్సిత అవసరం ఉందన్న విషయంను అతని బంధువులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు తెలుపడంతో ఆయన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకవెళ్లారు. ఆది శ్రీనివాస్ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బందికి విషయం తెలిపి సబీనా బేగంకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పదించిన వైద్యులు ఆమెను ఆసుపత్రిలో చేర్చుకుని వైద్యం అంది స్తున్నారు. అదే విధంగా అమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌ఓసిని అందించారు.

ఎస్‌జీఎఫ్ కన్వీనర్‌గా రాజమల్లయ్య

కొడిమ్యాల, ఆగస్టు 30 : కొడిమ్యాల మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్‌గా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీడీగా విదులు నిర్వహిస్తున్న బూట్ల రాజమల్లయ్యను 2024-2025 సంవత్సరానికి గాను నియామకం చేస్తు డీఈవో డా. బి. జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కన్వీనర్ మాట్లాడుతూ మండలంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎస్‌జీఎఫ్ కన్వీనర్‌గా నియమించినందుకు డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాంనా యక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

భీమారం, ఆగస్టు 30: భీమారం మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.10 వేల విలువ గల క్రీడా దుస్తులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్ పంపిణీ చేశారు.

విద్యార్థులు క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో రాణించడం వలన ఈ దుస్తులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయుడు హసేక్ హుస్సేన్, ఉ పాధ్యా యులుత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బాసూజీ కవిత, శోభన్, దాక్షాయిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు పోతురాజు సురేష్, భూ పతి తిరుపతి, వనపర్తి నవీన్, నల్లపు రాజేందర్, వడ్లూరి శేఖర్, శివ నూరి రాజేష్ పాల్గొన్నారు.